సాక్షి ములుగు

బుధవారం । 3 । ఏప్రిల్ । 2024



ఎవరిని వరించెనో?

టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో నాలుగు డైరెక్టర్ పోస్టుల నియామకానికి భారీగా దరఖాస్తులు వచ్చాయి.

- 8లో▸



కేటీఆర్ భాష మార్చుకోవాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇప్పటికైనా తన భాష మార్చుకోవాలని రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ హితవు పలికారు.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 42.3⁰ /22.7⁰

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ కాస్త చలిగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ 6:34	గురు 4:46

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి రూరల్: ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూపు 2, 3, 4 పోటీ పరీక్షలకు ఉచితంగా ప్రభుత్వం శిక్షణ ఇవ్వనుందని.. ఇందుకోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు నెలల పాటు ఉచిత భోజనంతో పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

6న సదరం క్యాంపు

భూపాలపల్లి రూరల్: శారీరక, మానసిక, వినికిడి, కంటిచూపు అంగవైకల్యం కలిగిన దివ్యాంగులకు ఈనెల 6న జిల్లాకేంద్రంలోని 100 పడకల ఆస్పత్రిలో సదరం క్యాంపు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఓ నరేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదరం క్యాంపునకు హాజరు కావడానికి సమీప మీసేవ కేంద్రాల్లో పేర్లు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. స్లాట్ బుక్ చేసుకున్నవారే హాజరు కావాలని, గతంలో తిరస్కరణకు గురైన వారికి అవకాశం లేదన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి



చిట్యాల: భారత రాజ్యాంగాన్ని ప్రతీ ఒక్కరు కాపాడుకోవాలని విముక్త చిరుతల పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి మచ్చ దేవేందర్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి అన్ని ప్రజాస్వామిక శక్తులు ఏకమై బీజేపీని ఓడించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అంబాల అనిల్, ఏవైఎస్ మండల అధ్యక్షుడు రాజేందర్, ఏవైఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పుల్ల మల్లయ్య, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మల్లేష్, నాయకులు ప్రవీణ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పాపన్న ఆశయాలు కొనసాగించాలి



భూపాలపల్లి రూరల్: సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను కొనసాగించాలని గౌడ ఐక్యవేదిక జిల్లా జేఏసీ చైర్మన్ బుర్ర రమేష్‌గౌడ్ అన్నారు. గౌడ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పాపన్నగౌడ్ 314 వర్ధంతి నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని కాకతీయ కళాతోరణం చౌక్‌లో ఉన్న సర్దార్ పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బుర్ర రమేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గొప్ప పోరాట యోధుడు పాపన్న అన్నారు. ఆయన పాలన కాలంలో 21 కోటలను నిర్మించాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ ఐక్య సంఘాల (జేఏసీ) కమిటీ సభ్యులు కుమారస్వామి, తాటి అశోక్‌గౌడ్, పులి వేణుగౌడ్, చుక్క బాలరాజ్‌గౌడ్, జగన్, సదానందం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లింపులో 5శాతం రాయితీ

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్ను ముందస్తు చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ అవకాశం కల్పించనున్నట్లు మున్సిపాలిటీ కమిషనర్ రాజేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీలోపు చెల్లించే వారు ఐదు శాతం రాయితీతో చెల్లించే అవకాశం ఉంటుందని తెలిపారు. సకాలంలో ఇంటి పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

'ఈశ్రమ్'తో భరోసా

జిల్లాలో 56,440మంది కార్మికులు నమోదు

- ఐదేళ్ల వరకు గడువు
- 60 ఏళ్లు దాటితే చెల్లని కార్డు

ఏటూరునాగారం: కార్మికుల సంక్షేమానికి కేంద్ర కార్మిక, ఉపాధిశాఖ ఈశ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించింది. ఆధార్‌కార్డు ద్వారా అసంఘటిత రంగ కార్మికులు తమ వివరాల్ని పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. అలా ఈశ్రమ్ కార్డు నమోదు చేసుకున్న రోజు నుంచి ఐదేళ్ల పాటు ఈ కార్డు అమలు లో ఉంటుంది. ఆ తర్వాత రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. 16– 59 సంవత్సరాల లోపు ఉన్న స్త్రీ, పురుషులకు మాత్రమే వర్తిస్తుంది. జిల్లాలోని 9 మండలాల్లో 56,440 మంది కార్మికులు ఈశ్రమ్ కార్డును ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేసుకోగా వారికి భరోసా కల్పిస్తుంది.

కార్మికులకు ప్రయోజనాలు

మహిళా కార్మికురాలి వివాహం, కార్మికుల ఇద్దరు కుమార్తెల వివాహం సందర్భంగా ఒక్కొక్కరికి రూ.30వేలు కానుకగా ఇస్తారు. ప్రసూతి సమయంలో మహిళా కార్మికురాలికి, కార్మికుని భార్యకు, కార్మికుల ఇద్దరు కుమార్తెలకు ఒక్కొక్కరికి రూ. 30 వేలు ఇస్తారు. అలాగే ప్రమాదవశాత్తు మరణిస్తే మరణించిన కార్మికుని కుటుంబ సభ్యులకు రూ.6లక్షలు, అంత్యక్రియల నిమిత్తం రూ.30వేలు వెంటనే అందజేస్తారు. సహజంగా మరణించిన కార్మికుని కుటుంబ సభ్యులకు రూ. ఒక లక్షా, అంత్యక్రియల నిమిత్తం రూ.30 వేలు ఇస్తారు. ప్రమాదంలో గాయపడి ప్రమాదవశాత్తు పూర్తి శాశ్వత అంగవైకల్యం కలిగిన వారికి రూ.5లక్షల ఆర్థిక సాయం అందుతుంది. ప్రమాదవశాత్తు పాక్షిక శాశ్వత అంగవైకల్యం కలిగిన వారికి రూ.4లక్షలు ఇస్తారు. ఎంప్లాయీస్ కాంపెన్సేషన్ యాక్టు ప్రకారం అంగవైకల్య శాతాన్ని బట్టి ఆర్థిక సాయం అందజేస్తారు. కార్మికులకు ప్రమాదం లేదా అనారోగ్యం వల్ల తాత్కాలిక అశక్తత(చాతకాకుండా) కలిగి చికిత్స నిమిత్తం 5 రోజులు ఆపై ఆస్పత్రిలో చేరిన వారికి రోజుకు రూ.300ల చొప్పున నెలకు రూ.4,500లు, ఆపై నుంచి మూడు నెలల లోపు వారికి రూ.13,500లు అందజేస్తారు.



పనిచేస్తున్న కార్మికులు(ఫైల్)



ఈ శ్రమ్ కార్డు

రిజిస్ట్రేషన్ ఇలా..

ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయడానికి ఈశ్రమ్.జీఓవీ.ఇన్‌లో అధికారిక వెబ్‌సైట్‌కి లాగిన్ అవ్వాలి. లింక్ ఓపెన్ చేయగానే ఆధార్ కార్డు అప్‌లోడ్ చేయగా మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. క్యాప్చర్ కోడ్ ఎంటర్ చేయాలి. వేలిముద్ర ద్వారా నమోదు చేయాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ తరువాత కార్మికులకు ప్రత్యేకమైన యూనివర్సల్ అకౌంట్ నంబర్(యూఏఎన్)తో కూడిన ఈశ్రమ్ కార్డు జారీ అవుతుంది. ఈ కార్డు ద్వారా ఎప్పుడైనా ఎక్కడైనా వివిధ సామాజిక భద్రత పథకాల ప్రయోజనాలను పొందవచ్చు. సంక్షోభ సమయాల్లో కార్మికులు అనేక ప్రయోజనకరమైన పథకాలకు కూడా అర్హులవుతారు. 16 నుంచి 59 ఏళ్ల స్త్రీ, పురుషులు అర్హులు.

16 నుంచి 59 ఏళ్ల లోపు ఉండాలి..

మహిళలు, పురుషులు 16 నుంచి 59 సంవత్సరాల లోపు ఉన్నవారికి ఈ శ్రమ్ కార్డు వర్తిస్తుంది. 60 సంవత్సరాలుంటే వర్తించదు. కార్మికులందరూ కార్డు తీసుకోవచ్చు. అర్హులైన వారికి లాభాలుంటాయి. కార్మికులు దీనిపై దృష్టి పెట్టాలి. జిల్లాలో ఇప్పటి వరకు 56,440 మంది రిజిస్టర్ అయ్యారు.

- వినోద, జిల్లా లేబర్ అధికారి

రూ.30వేలు వచ్చాయి..



గత ఏడాది ఈశ్రమ్ కార్డు రిజిస్ట్రేషన్ చేసుకున్నాను. నా భార్య డెలివరీ కావడంతో రూ.30వేలు వచ్చాయి. ఆ డబ్బులు ఎంతగానో ఉపయోగపడ్డాయి. అర్హులైన కార్మికులు కార్డును పొందితే ఎన్నో లాభాలు ఉన్నాయి. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం మంచి పథకాన్ని ప్రవేశపెట్టింది.

- రంజిత్, ఎలక్ట్రీషియన్

రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఎస్ఎస్‌తాడ్వాయి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాసంగి ధాన్యం కొనుగోళ్లపై శిక్షణ తరగతుల కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. రైతులు తమ పంటకు మద్దతు ధర పొందేందుకు నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ధాన్యాన్ని బాగా ఆరబెట్టి చెత్త, తాలు, మట్టి పెడ్డలు, రాళ్లు లేకుండా శుభ్రపరచాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ కొనుగోలు కేంద్రాలకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పంట తీసుకొని రావాలని తెలిపారు. ధాన్యం విక్రయించే సమయంలో రైతులు తమ ఫోన్ నంబర్‌ను ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతాకు లింక్ చేసి తీసుకుని రావాలన్నారు. ధాన్యం విక్రయించే సమయంలో ఓటీపీ కోసం సెల్ ఫోన్, ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం, బ్యాంక్ ఖాతా పుస్తకం తమ వెంట తీసుకుని రావాలన్నారు. కొనుగోలు కేంద్రంలో అవసరమైన మౌలిక వసతులను సరి చూసుకొని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు నిమిత్తం అవసరమైన వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలించాలన్నారు. అనంతరం పీఏసీఎస్ ఆధ్వర్యంలో కామారంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) మహేందర్‌జీ, జిల్లా సివిల్ సప్లయీస్ మేనేజర్ రాంపతి, డీఏఓ విజయ్ చంద్ర, డీసీఓ సర్దార్ సింగ్, గిరిజన సహకార సంస్థ మేనేజర్ దేవా, తహసీల్దార్ రవీందర్ పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి

ములుగు రూరల్: సర్దార్ సర్వాయి పాపన్న 314వ వర్ధంతిని మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కల్లుగీత కార్మిక సంఘం నాయకుడు రవిగౌడ్ హాజరై పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపన్న ఏలిన 21 కోటలను ప్రభుత్వం పర్యాటక కేంద్రాలుగా గుర్తించాలన్నారు. ఎన్నికల సమయంలో గౌడ కులస్తులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దొమ్మటి సదయ్య, పైడిమల్ల భరత్‌గౌడ్, వీరస్వామి, తోకల రవి, రవితేజ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

జాబ్‌మేళాకు భారీ స్పందన



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిన్న



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు భారీ స్పందన వచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ జె. చిన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లేస్‌మెంట్ సెల్, కెరీర్ గైడ్ అండ్ సెల్ ఆధ్వర్యంలో టైం స్ప్రో సౌజన్యంతో దాదాపు 7కంపెనీలకు సంబంధించిన బ్యాంకులు, ఈ కామర్స్ కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొన్నట్లు వివరించారు. వివిధ జిల్లాల నుంచి దాదాపు 200మంది అభ్యర్థులు వివిధ అర్హత పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. యాక్సిస్ బ్యాంకులో 25 మంది, ఐసీఐసీఐ బ్యాంకుకు 40 మంది అభ్యర్థులు సెలెక్ట్ అయినట్లు తెలిపారు. మొత్తం 200 మంది అభ్యర్థులకు గాను 65 మంది ఎంపికయ్యారని తెలిపారు. కళాశాలలో మొదటిసారిగా ఈ జాబ్ మేళా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

నగదు పట్టివేత

ములుగు రూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులో చేపట్టిన తనిఖీలో నగదు పట్టుబడినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మల్లంపల్లిలోని చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేపట్టగా ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న ఓ వాహనంలో సంజయ్ కుమార్ సాహు వద్ద రూ.52,500, సోమేష్ కుమార్ వద్ద రూ.6,800, మనిష్ కుమార్ వద్ద 59,300 లభించాయని తెలిపారు. అదేవిధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కర్కగూడెం వెళ్లే వాహనంలో ఎస్‌కే.అష్రఫ్ వద్ద రూ.ఒక లక్ష, రాజేశ్, సంపత్‌కుమార్‌ల వద్ద లక్ష రూపాయలు లభించగా సీజ్ చేసి గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించినట్లు ఎస్సై వెల్లడించారు.



డబ్బుతో పట్టుబడిన వారిని చూపుతున్న ఎస్సై వెంకటేశ్వర్లు

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలి

ఏటూరునాగారం: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని జిల్లా ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డిస్ట్రిక్ హాస్పిటల్‌లో 108 అంబులెన్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఈఎంటీ, ఎమర్జెన్సీ, మెడికల్ టెక్నీషియన్లకు మంగళవారం అంతర్జాతీయ 108 ఈఎంటీ డే శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్వర్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ మోహన్ లాల్, 108 ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్, ములుగు జిల్లా ఈఎంఈ చంద్రశేఖర్, 108 ఈఎంటీ, పైలెట్లు పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదం జరిగిందని ఫోన్ వస్తే 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుంటున్నారని తెలిపారు. తక్షణమే క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి ఆస్పత్రికి చేర్చుతున్నారని వివరించారు. ఆపదలో ఉన్నవారికి చికిత్సలు అందించి ప్రాణాలను కాపాడాలని సూచించారు.

అక్రమ పట్టాలు రద్దు చేయాలి

వెంకటాపురం(కె): ఏజెన్సీ ప్రాంతంలో వలస గిరిజనేతరుల అక్రమ పట్టాపాస్ పుస్తకాలను రద్దు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ అన్నారు. మండల పరిధిలోని ఆలుబాక గ్రామంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలుబాకలో అనేక మంది వలస గిరిజనేతరులు అక్రమ పట్టాలు చేసుకున్నారని తెలిపారు. వాటిపై అధికారులు విచారణ చేసి రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణబాబు, నేత్రనందకుమార్, సాంబశివరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సతీష్

పేదలకు సేవ చేయడానికే బీజేపీలో చేరిక

మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్

ఏటూరునాగారం: పేద ప్రజలకు మరింత సేవచేయడానికే బీజేపీలో చేరానని ఆపార్టీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని వైజంక్షన్‌లో గల పార్టీ కార్యాలయంలో మంగళవారం మండల పార్టీ అధ్యక్షుడు గాడిచర్ల రాజశేఖర్ అధ్యక్షతన ఎంపీ ఎన్నికలపై సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్‌తో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం హాజరు కాగా సీతారాంనాయక్ మాట్లాడారు. గతంలో తాను ఎంపీగా ఉన్నప్పుడు ఎన్నో అభివృద్ధి పనులు చేశానన్నారు. వెంకటాపురం(ఎం) మండల పరిధిలోని రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు రావడానికి, జిల్లా కేంద్రంలో గిరిజన యూనివర్శిటీ ఏర్పాటు చేయడానికి ఎంతో కృషిచేశానని వివరించారు. త్వరలోనే తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగై పోతుందన్నారు. ఆపార్టీ నాయకుల మాటలను ప్రజలు నమ్మొద్దన్నారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు మోసానికి గురయ్యారన్నారు. పేద ప్రజలకు అండగా ఉండడానికి, ప్రధాని నరేంద్ర మోడీ అడుగు జాడల్లో నడవాలని తాను బీజేపీలో చేరానని వివరించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ బీజేపీ అభ్యర్థిగా బరిలో నిల్వనున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ మూసుకు శ్రీనివాస్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాడి రామరాజు నేత, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గండపల్లి సత్యం, దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు వావిలాల జనార్దన్, వెంకటేశ్వర్లు, కర్ణ సంపత్, గద్దెల ప్రణయ్, పరిదల శ్రీను, యానాల చంద్రారెడ్డి, మనోహర్, శివ, గంగ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీతారాంనాయక్

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మంగపేట: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని మహబూబాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి, మాజీ ఎంపీ సీతారాంనాయక్ పార్టీ నాయకులకు, ముఖ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో మంగళవారం ఏర్పాటు చేసిన ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో మళ్లీ రాబోయేది బీజేపీ ప్రభుత్వమే అన్నారు. దేశంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసినా అవి కాంగ్రెస్ పార్టీ నాయకులకు కనిపించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోడీకి పెరుగుతున్న దరణ చూసి ఓర్వలేక కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఎన్నికలకు ఇంకా 40 రోజుల సమయమే ఉందని బీజేపీ కార్యకర్తలందరూ కష్టపడి పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలను ఆయన శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బలరాం, మండల పార్టీ అధ్యక్షుడు పల్నాటి సతీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గగులోత్ లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాలు తగ్గించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ మధుసూదన్

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో మాతా, శిశు మరణాల శాతం తగ్గించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ ఆదేశించారు. మాతా, శిశు మరణాలపై మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో వైద్యాధికారులు, సూపర్‌వైజర్లతో డీఎంహెచ్ఓ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మూడు మాతృ మరణాలు, 64 శిశు మరణాలు నమోదు అయినట్లు తెలిపారు. కాళేశ్వరం, కాటారం, భూపాలపల్లి, మొగుళ్లపల్లి, సీహెచ్‌సీ చిట్యాల పరిధిలో నమోదైనట్లు చెప్పారు. ఆశలు, ఏఎన్ఎంలు విధిగా క్రమం తప్పకుండా గర్భిణులను బాలింతలను గృహ సందర్శన చేసి చూడాలని సూచించారు. మాతా, శిశు మరణాలను తగ్గించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కొమురయ్య, పీఓఎంసీహెచ్ డాక్టర్ శ్రీదేవి, పీఓ సీహెచ్ఐ డాక్టర్ ప్రమోద్‌కుమార్, డెమో శ్రీదేవి, పీహెచ్‌సీ వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చిట్యాల: మండలంలోని నవాబుపేట చలివాగు నుంచి మంగళవారం అక్రమంగా ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. నవాబుపేట గ్రామానికి చెందిన శనిగరపు ఓదేలు, కాసగాని కుమారస్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. మండలంలోని ఏ ప్రాంతంలోనైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలకు ప్రజలు సహకరించాలి

- భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు
- గొర్లవీడు తండాల్లో కార్డన్‌సెర్చ్

భూపాలపల్లి రూరల్: పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు అన్నారు. మంగళవారం తెల్లవారు జామున భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు తండాల్లో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా సోదాలు నిర్వహించారు. కాగితాలు లేని, నంబర్ ప్లేట్‌లేని వాహనాలను సీజ్ చేశారు. 55 లీటర్ల బెల్లం పానకాన్ని సీజ్‌చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. అనంతరం గ్రామ కూడలిలో ఏర్పాటుచేసిన సమావేశంలో డీఎస్పీ సంపత్‌రావు మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజల కోసమే పోలీసులు పనిచేస్తారని, గ్రామాల్లో యువత గంజాయి, మత్తు, మద్య, గుట్కా, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాల మరణాలతో చాలా కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా ఉంటుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. సమస్యలు ఉంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్, ఎస్సై సుధాకర్, గణపురం ఎస్సై సాంబమూర్తి, రేగొండ ఎస్సై రవికుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ సంపత్‌రావు

క్లుప్తంగా

అదనపు కట్నం కోసం వేధింపులు..

● భర్త, అత్త, మరిదిపై కేసు

గార్ల: అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధిస్తున్న భర్త, అత్త, మరిదిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ జీనత్‌కుమార్ తెలిపారు. గార్ల మండలం ముల్కనూర్‌కు చెందిన దేవికతో ఇల్లెందు మండలం ఇల్లందులపాడు గ్రామానికి చెందిన వినయ్‌కి 5 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కొంతకాలం వీరి కాపురం సజావుగానే సాగింది. దంపతులకు మూడేళ్ల కూతురు ఉంది. ఈ క్రమంలో గతేడాది నుంచి అదనపు కట్నం రూ.5 లక్షలు తీసుకురావాలంటూ భర్త వినయ్‌తో పాటు అత్త, మరిది .. దేవికను తరచూ వేధిస్తున్నారు. దీంతో వేధింపులు తాళలేక పుట్టింటికి వచ్చిన దేవిక మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు ముగ్గురిపై నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

గంజాయి విక్రయం.. నలుగురి అరెస్ట్

● 430 గ్రాముల సరుకు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై

కాటారం: గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను అరెస్ట్ చేసినట్లు సీఐ నాగార్జునారావు, ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు. ఈమేరకు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కాటారానికి చెందిన మాడెం ప్రవీణ్, గంట పరిపూర్ణం, మండలంలోని బయ్యారానికి చెందిన జగజంపుల విష్ణు, కొత్తపల్లికి చెందిన సొదారి సునీల్.. కొంతకాలంగా మహారాష్ట్రలో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నారు. అనంతరం గంజాయిని సేవించడంతో పాటు కాటారం చుట్టుపక్కల ప్రాంతంలో విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం బయ్యారం సమీపంలో నలుగురు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు అటువైపునకు వెళ్లారు. అనుమానాస్పద స్థితిలో ఎదురుగా వస్తున్న ప్రవీణ్, పరిపూర్ణం, విష్ణు, సునీల్‌ను గుర్తించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.12 వేల విలువైన 430 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించినట్లు సీఐ నాగార్జునారావు, ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై–2 హరిశేఖర్, కానిస్టేబుల్స్ లక్ష్మీరాజ్, వేణు, లవన్, నాగరాజు, హోంగార్డు తోలెం తిరుపతి ఉన్నారు.

ఎవరిని వరించెనో?

టీఎస్ ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ పోస్టులకు భారీగా దరఖాస్తులు

- పదవుల కోసం ఆశావహుల ప్రయత్నాలు
- ప్రస్తుతం పని చేస్తున్న సీజీఎంలతో సహా రిటైర్డ్ సీఈలు దరఖాస్తు
- జనవరి చివరి వారంలో పాత పాలకవర్గం తొలగింపు



హన్మకొండ : అత్యంత కీలకమైన ఆ పోస్టులు ఎవరిని వరించెనో?. కేవలం 4 పదవులకు రిటైర్డ్ అధికారుల నుంచి మొదలు.. ఉన్నత స్థాయి ఉద్యోగుల వరకు పోటీ పడుతున్నారు. ఈ పదవులు దక్కించుకునేందుకు ఎవరి స్థాయిలో వారు ప్రయత్నాలు ముమ్మరం చేసుకుంటున్నారని తెలిసింది. టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో నాలుగు డైరెక్టర్ పోస్టుల నియామకానికి భారీగా దరఖాస్తులు వచ్చాయి. దాదాపు 83 అప్లికేషన్స్ వచ్చినట్లు తెలిసింది. శాసనసభ ఎన్నికల్లో గెలుపొంది అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత పాలక మండలిని రద్దు చేసింది. అనంతరం నూతన డైరెక్టర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఆశావహులు భారీగా దరఖాస్తు చేసుకున్నారు. టీఎస్ జెన్‌కో, టీఎస్ ట్రాన్స్‌కో, టీఎస్ ఎన్పీడీసీఎల్, టీఎస్ ఎస్పీడీసీఎల్‌లో ప్రస్తుతం పని చేస్తున్న చీఫ్ ఇంజనీర్ స్థాయి అధికారులు, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్లు డైరెక్టర్ పదవుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఎన్పీడీసీఎల్‌లో ప్రస్తుతం పని చేస్తున్న సీజీఎంలందరూ దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటి సీఎండీ అన్నమనేని గోపాల్ రావు రాజీనామా చేశారు. దీంతో ప్రభుత్వం సీఎండీగా ఐఏఎస్ కర్నాటి వరుణ్ రెడ్డిని చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించింది.

అనంతరం జనవరి 29న నలుగురు డైరెక్టర్లను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అదే ఉత్తర్వుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సీఎండీకి ఆదేశాలిచ్చింది. దీంతో అదే నెల 30న ఇదే కంపెనీలో పని చేస్తున్న చీఫ్ జనరల్ మేనేజర్లకు అదనంగా డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు. పర్చేజ్ అండ్ మెటీరియల్ మేనేజిమెంట్ చీఫ్ జనరల్ మేనేజర్‌గా కొనసాగుతున్న టి.సదర్‌లాల్‌ను డైరెక్టర్ ప్రాజెక్ట్స్‌గా నియమించారు. ప్రాజెక్ట్స్ చీఫ్ జనరల్ మేనేజర్‌గా కొనసాగుతున్న వి.మోహన్ రావును డైరెక్టర్ ఆపరేషన్‌గా, ఎంఆర్‌టీ చీఫ్ జనరల్ మేనేజర్‌గా కొనసాగుతున్న బి.అశోక్ కుమార్‌కు డైరెక్టర్‌గా హెచ్‌ఆర్‌డీ, ఇండస్ట్రియల్ రిలేషన్‌షిప్‌గా నియమించారు. అప్పటికే ఫైనాన్స్ సీజీఎం ఇన్‌చార్జ్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయి డైరెక్టర్ల నియామకానికి ప్రభుత్వం జనవరి 30న నోటిఫికేషన్ జారీ చేసింది. గతంలో ఐదు డైరెక్టర్ పదవులుండగా నాలుగు పదవులకు మాత్రమే నోటిఫికేషన్ జారీ చేసింది. డైరెక్టర్ ఫైనాన్స్, డైరెక్టర్ హెచ్‌ఆర్‌డీ అండ్ ఐఆర్, డైరెక్టర్ ఆపరేషన్స్, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ పదవులకు దరఖాస్తులు ఆహ్వానించింది. మార్చి 2వ తేదీ వరకు గడువు విధించింది. దీంతో హెచ్‌ఆర్‌డీ అండ్ ఐఆర్, ఆపరేషన్స్, ప్రాజెక్ట్స్ డైరెక్టర్ పదవులకు 25 చొప్పున దరఖాస్తులు, ఫైనాన్స్ డైరెక్టర్‌కు 8 దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. నాలుగు పదవులకు 83 దరఖాస్తులు వచ్చాయి.

పోటీ తీవ్రం..

దరఖాస్తు చేసుకున్న ఆశావహులు పదవులు దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. ఎన్పీడీసీఎల్‌తో పాటు, ఇతర కంపెనీలకు చెందిన అర్హులు కూడా దరఖాస్తు చేసుకోవడంతో తీవ్ర పోటీ నెలకొంది. దీంతో ఎవరికి వారు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో చీఫ్ ఇంజనీర్ స్థాయిలో పని చేసి రిటైర్డ్ అయిన ఇంజనీర్లతో పాటు ప్రస్తుతం పని చేస్తున్న సీజీఎంలు దరఖాస్తు చేసుకున్నారు. డైరెక్టర్ పదవులు నాలుగు మాత్రమే ఉండడం, ఇందులో ఇంజనీర్లకు సంబంధించినవి మూడు మాత్రమే ఉండడంతో ఎలాగైనా దక్కించుకోవాలనే ఆలోచనలో పడ్డారు. ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం ప్రయత్నిస్తున్నారు. అయితే ప్రభుత్వం సీజీఎంలకే డైరెక్టర్లుగా పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తారని అప్పట్లో ప్రచారం జరిగింది. తద్వారా విద్యుత్ సంస్థలపై ఆర్థిక భారం తగ్గనుంది. ఇతరులను డైరెక్టర్లుగా నియమిస్తే ఒక్కో డైరెక్టర్‌కు జీతం, కారు, ఇతర అలవెన్స్‌లు కలిపించే ఒక్కో డైరెక్టర్‌పై నెలకు రూ.2.40 లక్షల వరకు వ్యయం అవుతుంది. ఇలా నలుగురు డైరెక్టర్లకు నెలకు రూ.9.60 లక్షలు, ఏడాదికి సంస్థపై రూ.1.15,20,000 భారం పడుతుంది. ఇప్పటికే నష్టాల్లో ఉన్న విద్యుత్ సంస్థలపై భారం పడకుండా ఉండాలంటే సీజీఎంలను పూర్తి స్థాయి డైరెక్టర్లుగా నియమిస్తే సంస్థపై కొంతైనా భారం తప్పుతుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ డైరెక్టర్లుగా సీజీఎంలు సమర్థవంతంగా సేవలు అందిస్తున్నారు. డైరెక్టర్లు లేని లోటు ఎక్కడా కనిపించడం లేదని పలువురు సిబ్బంది పేర్కొంటున్నారు. అయితే రిటైర్డ్ అయిన వారికి ప్రాధాన్యం ఇస్తుందా? సంస్థల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సీజీఎంలనే పూర్తి స్థాయి డైరెక్టర్లుగా నియమిస్తుందా అనే విషయం ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

వైద్య పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ: జనగామ మెడికల్ కళాశాలతో పాటు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్ (ఎస్‌ఆర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎంసీహెచ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2025 మార్చి 31 లేదా రెగ్యులర్ పోస్టులు భర్తీ చేసే వరకు తాత్కాలిక ప్రాతిపదికన(కాంట్రాక్ట్), గౌరవ వేతనంతో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ, పాథాలజీ, ఫల్మనాలజీ, మైక్రో బయోలజీ, ఫోరెనిక్స్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, ఈఎన్‌టీ, అనస్థీయాలజీ, రేడియో–డయాగ్నోసిస్, ఆర్థోపెడిక్, మానసిక, కంటి వైద్య పోస్టులకు సంబంధించి నాలుగు కేటగిరీల్లో 36 ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ నెల 6వ తేదీన జనగామ చంపక్ హిల్స్ మాతాశిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్) రెండో అంతస్తు ప్రిన్సిపాల్ చాంబర్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఆయా కేటగిరీలకు సంబంధించిన అప్లికేషన్లను www.gmcjangaon.org,www.jangaontelangana.gov.in వెబ్‌సైట్‌ల నుంచి ఫార్మెట్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అర్హత సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

కేఎంసీలో..

ఎంజీఎం : కాకతీయ మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.పూర్తి వివరాలకు www.kmc.wgl.com ను సంప్రదించాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులకు ఈ నెల 6న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



నర్సయ్య మృతదేహం

తొర్రూరు రూరల్ : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని గుర్తూరులో జరిగింది. ఎస్సై జగదీష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గుద్దెటి నర్సయ్య(43) కొన్ని సంవత్సరాల నుంచి గొర్రె, మేకల కొనుగోలు వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబ పోషణ, వ్యాపారం నిమిత్తం సుమారు రూ. 5 లక్షల వరకు అప్పు అయింది. అయితే అప్పు తీర్చే మార్గం కనిపించక కొంతకాలంగా మనస్తాపానికి గురవుతున్న నర్సయ్య.. మంగళవారం గ్రామ శివారులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు నకిలీ మావోయిస్టుల అరెస్ట్

● వివరాలు వెల్లడించిన హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం : మావోయిస్టుల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరు నకిలీ మావోయిస్టులను హనుమకొండ, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేసినట్లు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు మంగళవారం హనుమకొండ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం గొల్లపల్లికి చెందిన దాసరి శ్రీకాంత్ నాలుగు రోజుల క్రితం భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్టు) చర్ల శబరి ఏరియా కమిటీ కమాండర్ దేవన్న పేరుతో ఎస్ఎస్ఆర్ గ్రూప్, అజరా హాస్పిటల్, దీపక్ స్కిన్ క్లినిక్ యాజమాన్యాలకు లేఖలు పంపి ఫోన్లలో బెదిరింపులకు పాల్పడ్డాడు. హాస్పిటల్స్, భూములకు సంబంధించిన పత్రాలు, లైసెన్స్‌లు పట్టుకుని ప్రజాకోర్టుకు రావాలని బెదిరించడంతో ఆత్మకూరు, హనుమకొండ పోలీస్‌స్టేషన్లలో మూడు కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో పోలీసులు హనుమకొండ జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా దాసరి శ్రీకాంత్‌తో పాటు అతడికి సహకరించిన వరంగల్ కరీమాబాద్‌కు చెందిన బాలిని మహేష్ పట్టుబడ్డాడు. వారిని విచారించగా నేరం ఒప్పుకున్నారు. దీంతో నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు, మావోయిస్టు పేరుతో ఉన్న 70 లెటర్ ప్యాడ్‌లు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. సమావేశంలో హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీష్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య, హనుమకొండ ఎస్సై ఎ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కూలిన వ్యవసాయ బావి దరి..

మట్టిలో కూరుకుపోయిన ఇద్దరు వ్యక్తులు

- రెండున్నర గంటల పాటు నరకయాతన
- స్థానికులు, పోలీసుల సాయంతో ప్రాణాలతో బయటపడిన మృత్యుంజయులు



బావిలో దరి కూలడంతో మట్టిలో కూరుకుపోయిన సుధాకర్, నరేష్



సుధాకర్‌ను బయటకు లాగుతున్న స్థానికులు

కేసముద్రం: కొత్తగా తవ్వుతున్న వ్యవసాయ బావి దరి ఒక్కసారిగా కూలింది. ఈ ఘటనలో బావిలో ఉన్న ఇద్దరు మట్టిలో కూరుకుపోయారు. రెండున్నర గంటల పాటు నరకయాతన అనుభవించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని ఇద్దరిని యంత్రం సాయంతో బయటకు తీశారు. దీంతో సదరు వ్యక్తులు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటన మంగళవారం మండలంలోని గాంధీనగర్ జీపీలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని తాళ్లపూసపల్లికి చెందిన రైతు పోత్కం సుధాకర్ పక్క గ్రామం గాంధీపురం జీపీ పరిధిలో తనకున్న వ్యవసాయ భూమిలో హిటాచీ యంత్రంతో కొత్తగా బావి తీయిస్తున్నాడు. ఈ క్రమంలో బావిలో మట్టి తోడుతుండగా బండ వచ్చింది. బండను పరిశీలించేందుకు సుధాకర్.. పెద్దమోరితండాజీపీకి చెందిన జాటోత్ నరేష్‌తో కలిసి బావిలోకి దిగారు. ఈ క్రమంలో ఒక్కసారిగా దరి కూలింది. దీంతో మట్టి మీదపడడంతోపాటు అడుగుభాగంలో నీటి ఊటరావడంతో వారు కూరుకుపోయారు. దాదాపు మట్టిలో మెడభాగం వరకు కూరుకుపోయిన ఆ ఇద్దరు.. తమను కాపాడాలంటూ కేకలు పెట్టారు. ఈ కేకలు విన్న గ్రామస్తులు బావి వద్దకు వచ్చారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై వంశీధర్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకున్నారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న ఇద్దరిని కాపాడేందుకు స్థానికులు బావిలోపలికి దిగారు. పారసాయంతో కాళ్ల వరకు మట్టిని తొలగించారు. అయినా ఫలితం లేకపోవడంతో చివరకు యంత్రం సాయంతో బయటకు లాగారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలుకావడంతో 108లో మానుకోట ఆసుపత్రికి తరలించారు. కాగా, ఘటన సాయంత్రం 4 గంటల సమయంలో జరగగా, 6.30 గంటల సమయంలో వారిని బయటకు తీశారు. అప్పటి వరకు స్థానికులు, బంధువులు ఊపిరి బిగపట్టుకుని ఎదురుచూశారు.

క్రేన్ డబ్బా మీద పడి వ్యక్తి మృతి..

● నర్సింహాపురం బంజర గ్రామంలో ఘటన



రవి (ఫైల్)

నర్సింహులపేట: బావిలో పూడిక తీస్తుండగా క్రేన్ డబ్బా మీద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని నర్సింహాపురం బంజర శివారులో జరిగింది. నర్సింహాపురం బంజర గ్రామానికి చెందిన బయ్య వెంకన్న వ్యవసాయ బావిలో పూడికతీత చేపడుతున్నాడు. ఈ పనులకు మండలంలోని పత్తితండాకు చెందిన గుగులోత్ రవి (40) వెళ్లాడు. ఈ క్రమంలో క్రేన్‌తో పూడిక తీత పనులు తీస్తుండగా వైర్ తెగింది. దీంతో ఒక్కసారిగా డబ్బా రవి మీద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మహబూబాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన ఎస్సై గండ్రాతి సతీష్ ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య సుమిత్ర, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆరోపణలను నిరూపించకపోతే..

పల్లాను బట్టలూడదీసి నిలబెడతా

● స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



హన్మకొండ : తాను అవినీతి, దోపిడీకి పాల్పడ్డానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చేసిన ఆరోపణలను ఆధారాలతో నిరూపించకపోతే ఆయనను జనగామ చౌరస్తాలో బట్టలూడదీసి నిలబెడతానని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హెచ్చరించారు. మంగళవారం హనుమకొండ కనకదుర్గ కాలనీలోని స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాపై చేసిన ఆరోపణలను ఎన్నికల ముందు నిరూపిస్తే మీ పార్టీకే మేలు జరుగుతుందన్నారు. మనువరాలి వయసున్న అభ్యర్థిపై ఓటమి చెందిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. అహంకారం, బలుపు మాటలే ఓడించాయన్నారు. కడియం శ్రీహరి ఎలా గెలుస్తాడనే అక్కసుతోనే మాట్లాడుతున్నట్లుగా ఉందన్నారు. తనను విమర్శించిన నాయకుల అవినీతి, భూకబ్జాలు బయటపెడితే ప్రజల్లో తిరగలేరన్నారు. ఎస్సీ వర్గీకరణ కోరుకునే వారిలో ముందుంటానన్నారు. తనపై మంద కృష్ణ మాట్లాడుతున్న తీరు హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. బీజేపీకి ఓటు వేయాలని చెప్పే ముందు దండోరా ముసుగు తొలగించుకోవాలని హితవు పలికారు. మానకొండూరులో గెలవని రసమయి బాలకిషన్ తన ఇంటి ముందుకు వచ్చి చావు డప్పు కొడతానని అంటున్నాడని, అక్కడి ప్రజలు చేసిన బుద్ధి సరిపోలేదా అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడానికి, నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరానన్నారు. కడియం కావ్య తన మాదిరిగానే నీతి, నిజాయితీగా ఉంటారని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కడియం కావ్య మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

కేటీఆర్.. భాష మార్చుకోవాలి



మాట్లాడుతున్న మంత్రి సురేఖ. పక్కన ఎమ్మెల్యేలు కడియం, రేవూరి, నాయిని, నాగరాజు, సత్యనారాయణ

● మంత్రి కొండా సురేఖ

హన్మకొండ చౌరస్తా: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇప్పటికైనా తన భాష మార్చుకోవాలని రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ హితవు పలికారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, కడియం శ్రీహరితో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. భాషను అలవాటు చేసిందే కేసీఆర్ కుటుంబమన్నారు. ఇప్పుడు తమకు లీగల్ నోటీసులు పంపిస్తే భయపడేది లేదని, అది పెద్ద సమస్యే కాదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు పిచ్చి జోకులు వేసి అపహాస్యం చేసిందే కేసీఆర్, కేటీఆర్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో కేటీఆర్ లేనప్పుడు ఎందుకు భుజాలు తడుముకుంటున్నాడన్నారు. చేసిందే బుద్ధి తక్కువ పని.. అది సమర్థించుకోవడానికే పిచ్చిగా మాట్లాడుతున్నాడంటూ ధ్వజమెత్తారు. లిక్కర్ స్కాంలో కేసీఆర్ కూతురు కవిత ప్రస్తుతం జైలులో ఊచలు లెక్కపెడుతోందన్నారు. తనకు తెలిసి ఇన్నేళ్లలో కవిత మెడలో తాళి చూడలేదని, ఇప్పుడు జైలుకు వెళ్లాక తాళి కావాలనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో అత్యధిక స్థానాలు గెలుచుకుంటామన్నారు. ఈనెల 6వ తేదీన హైదరాబాద్‌లోని తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రకటన కోసం భారీ బహిరంగ సభ నిర్వహిస్తోందన్నారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ హాజరయ్యే ఈ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, నాయకులను సమన్వయం చేసుకుని కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే మీడియాకు గౌరవం, ప్రాధాన్యం లభించిందన్నారు. కేసీఆర్ తన పాలనలో మీడియాను అవమానించారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో మీడియాకు గుర్తింపు లభిస్తోందన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశాన్ని త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. డీసీసీ వరంగల్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ పాల్గొన్నారు.

రూ.8 లక్షల నగదు స్వాధీనం



దోర్నకల్: నగదు స్వాధీనం చేసుకుని రసీదు అందజేస్తున్న సిబ్బంది

దోర్నకల్ : దోర్నకల్ మండలం ముల్కలపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మంగళవారం రూ.8 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నల్లబెల్లి మండలం అర్వపల్లి జీపీ పరిధిలోని బీల్యానాయక్‌తండాకు చెందిన మాలోత్ సోరన్‌సింగ్ టాటా ఏస్ వాహనంలో ఖమ్మం నుంచి మహబూబాబాద్ వైపునకు వెళ్తుండగా ముల్కలపల్లి చెక్‌పోస్టు వద్ద సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఇందులో రూ.4.5 లక్షల నగదు పట్టుబడింది. దీనికి ఎలాంటి రసీదులు లేకపోవడంతో డబ్బును సీజ్ చేశారు. అలాగే, ములుగు జిల్లా జగ్గన్నపేట శివారు అర్వపల్లికి చెందిన కావాటి రవి టాటా ఏస్ వాహనంలో మహబూబాబాద్ వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో చెక్‌పోస్టు సిబ్బంది తనిఖీ చేయడంతో రూ.3.5 లక్షల నగదు పట్టుబడింది. ఈ డబ్బుకు ఎలాంటి ఆధారం లేకపోవడంతో సీజ్ చేశారు. కాగా, తాము మిర్చి పంటను విక్రయించి నగదుతో వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నట్లు సోరన్‌సింగ్, కావాటి రవి తెలిపారు. పట్టుబడిన నగదును సీజ్ చేసి బాధితులకు రసీదులు అందించినట్లు చెక్‌పోస్టు సిబ్బంది తెలిపారు.

కొత్తగట్టు సింగారం వద్ద రూ.6.40 లక్షలు..

శాయంపేట : పరకాల, హనుమకొండ ప్రధాన రహదారిలోని కొత్తగట్టు సింగారం స్టేజీ వద్ద మంగళవారం శాయంపేట ఎస్సై ప్రమోద్‌కుమార్ వాహన తనిఖీలు చేపట్టారు. ఇందులో ములుగు జిల్లా కాట్రపల్లి గ్రామానికి చెందిన ఏట్యాకరి వెంకన్న కారును తనిఖీ చేయగా రూ. 3లక్షల 90వేల నగదు, చిట్యాల మండలం జూకల్లు చెందిన తాట రాజబాబు టాటా ఏస్ వాహనంలో రూ. 2లక్షల 50వేలు.. మొత్తం రూ. 6 లక్షల 40వేలు లభ్యమయ్యాయి. ఈ నగదుకు ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసి భూపాలపల్లి ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు.

క్రూ లింక్‌ల తరలింపు నిలిపివేత

సాక్షి ఎఫెక్ట్..



కాజీపేట రూరల్ : కాజీపేట నుంచి సికింద్రాబాద్‌కు క్రూలింక్‌ల తరలింపును మంగళవారం నుంచి నిలిపివేసినట్లు స్థానిక రైల్వే అధికారులు, రైల్వే లోకోపైలెట్లు 'సాక్షి'కి తెలిపారు. 'కాజీపేట నుంచి రైళ్ల లింక్‌ల తరలింపు' అనే శీర్షికతో 'సాక్షి'దినపత్రికలో మార్చి 31వ తేదీన కథనం ప్రచురితమైన విషయం విధితమే. ఈ మేరకు రైల్వే ట్రేడ్‌యూనియన్ల నాయకులు, సికింద్రాబాద్ రైల్వే అధికారులు సమావేశమై కాజీపేట క్రూ లింక్‌ల తరలింపుపై ఓ నిర్ణయానికి వచ్చారు. సికింద్రాబాద్–సిర్‌పూర్ కాగజ్‌నగర్–సికింద్రాబాద్ సిర్‌పూర్‌కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–బెల్లంపల్లి–సికింద్రాబాద్ భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–మణుగూరు –సికింద్రాబాద్ మణుగూరు ఎక్స్‌ప్రెస్ 3 క్రూ లింక్‌లు, 6 రైళ్ల తరలింపును తాత్కాలికంగా నిలిపివేసి కాజీపేట నుంచే ఆపరేటింగ్ చేసేలా చర్చించినట్లు స్థానిక రైల్వే అధికారులు, లోకోపైలెట్లు తెలిపారు. ఈ మూడు క్రూ లింక్‌లను మంగళవారం కాజీపేట లోకోపైలెట్ డిపో నుంచి ఆపరేట్ చేసినట్లు తెలిపారు. కాగా, కాజీపేట క్రూ లింక్‌ల తరలింపు విషయంపై బుధవారం కూడా సికింద్రాబాద్‌లో రైల్వే అధికారులు, ట్రేడ్‌యూనియన్ల నాయకులు మాట్లాడి చర్చించి పర్మినెంట్‌గా ఓ నిర్ణయానికి రానున్నట్లు తెలిపారు. కాగా, 'సాక్షి' కథనంతో స్థానిక ఎమ్మెల్యే, రైల్వే అధికారులు, ట్రేడ్‌యూనియన్ల నాయకులు స్పందించి సకాలంలో మాట్లాడి కాజీపేట క్రూ లింక్‌ల తరలింపును నిలిపివేయడంపై లోకోపైలెట్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టెన్త్ స్పాట్ వాల్యుయేషన్‌కు ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి మూల్యాంకన ప్రక్రియ
- 2లక్షల 20వేల జవాబుపత్రాల రాక

విద్యారణ్యపురి: టెన్త్ స్పాట్ వాల్యుయేషన్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేటి (బుధవారం) నుంచి మూల్యాంకన ప్రక్రియ ప్రారంభంకానుంది. ఈ నెల 11వ తేదీ వరకు కొనసాగుతుంది. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరు జిల్లాలు హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, భూపాలపల్లి ఉండగా ఉమ్మడి జిల్లా కేంద్రం హనుమకొండలోనే టెన్త్ వాల్యుయేషన్‌కు స్పాట్ కేంద్రం ఒక్కటే ఏర్పాటు చేశారు. కాజీపేట ఫాతిమా హైస్కూల్‌లో ఈ క్యాంపును ఏర్పాటుచేశారు. ఈ స్పాట్‌క్యాంపునకు 2లక్షల 20వేల జవాబుపత్రాలు వచ్చాయి. వాల్యుయేషన్‌కు ఆయా సబ్జెక్టులు బోధించే 1060 మంది స్కూల్ అసిస్టెంట్లను అసిస్టెంట్‌ఎగ్జామినర్లుగా(ఏఈ) నియమించారు. అందులోనుంచే అవసరం మేరకు చీఫ్‌ఎగ్జామినర్లుగా(సీఈ) కూడా నియమిస్తారు. అలాగే, స్పెషల్ అసిస్టెంట్లుగా 450మంది ఎస్‌జీటీలను నియమించారు. ఈనెల 3న ఉదయం 9గంటలకు ఏఈలు, స్పెషల్‌అసిస్టెంట్లు కాజీపేటలోని స్పాట్‌కేంద్రంలో రిపోర్టు చేయాల్సింటుంది. ఈ స్పాట్‌వాల్యుయేషన్ క్యాంప్ ఆఫీసర్‌గా హనుమకొండ డీఈఓ ఎండి అబ్దుల్‌హై వ్యవహరిస్తున్నారు. స్పాట్‌వాల్యుయేషన్ విధులకు నియమితులైన ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరై మూల్యాంకనం చేయాల్సింటుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.